క్లుప్తంగా

నేడు నేత్ర వైద్య శిబిరం

హిరమండలం: మండల కేంద్రంలోని న్యూ బ్యారేజీ సెంటర్ కోదండరామాలయం ఆవరణంలో గురువారం శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ మేరకు జెడ్పీటీసీ సభ్యుడు పొగిరి బుచ్చిబాబు, శిబిరం సమన్వయకర్త టి.రామారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కంటి రోగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి



మొక్కలు నాటుతున్న ఎస్ఐ, జనసేన కార్యకర్తలు

సారవకోట: పర్యావరణాన్ని పరిరక్షించాలని ఎస్ఐ అప్పారావు అన్నారు. పోలీసుస్టేషన్ ఆవరణలో బుధవారం మండలంలోని జనసేన కార్యకర్తలు, ఎస్ఐతో కలిసి మొక్కలు నాటారు. జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ డిప్యూటీ సీఎంగా బాధ్యతలు స్వీకరించడంతో మొక్కలు నాటినట్లు జనసేన కార్యకర్తలు తెలిపారు.

ఎస్ఐగా ఉద్యోగోన్నతి



హిరమండలం: స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్న మెట్ట సుధాకర్ ఎస్సైగా ఉద్యోగోన్నతి పొందారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ఆరుగురు ఏఎస్సైలకు ఎస్సైలుగా ఉద్యోగోన్నతి లభించిందన్నారు. ఈ మేరకు డీఐజీ విశాల్ గున్ని ఉత్తర్వులు జారీ చేశారన్నారు. విశాఖపట్నం డీఐజీ రేంజ్ కార్యాలయంలో రిపోర్టు చేస్తున్నట్లు తెలిపారు. పదోన్నతి పొందిన సుధాకర్‌కు ఎస్సై జి.నారాయణస్వామి, సిబ్బంది అభినందించారు.

ఎమ్మెల్యే దృష్టికి హాస్టల్ సమస్య

సారవకోట: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను అదే ఆవరణలో ఉన్న సమీకృత వసతి గృహానికి అనుసంధానం చేయాలని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తిని ప్రిన్సిపాల్ వి.సుశీల్ కుమార్ కోరారు. కళాశాల సిబ్బందితో కలిసి ఎమ్మెల్యేను ఆయన క్యాంప్ కార్యాలయంలో బుధవారం కలిశారు. కళాశాలలో ఉన్న సమస్యలను వివరించారు. కళాశాలలో అడ్మిషన్లు పెరిగేందుకు వసతిగృహానికి అనుసంధానం చేస్తే సుదూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు వసతి కల్పించేందుకు అవకాశం ఉంటుందన్నారు.

ట్యాంకర్ ద్వారా తాగునీటి సరఫరా



నీరు సరఫరా చేస్తున్న అధికారులు

పాతపట్నం: పాతపట్నం మేజర్ పంచాయతీ పరిధిలోని బాలాజీనగర్-2కు ట్యాంకర్ ద్వారా తాగునీరు అందించామని ఎంపీడీఓ రామకృష్ణరాజు అన్నారు. ఎంపీడీఓ, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ కల్యాణ్, ఈఓ కూర్మారావు కలిసి ఇంటింటికీ కుళాయిలను బుధవారం పరిశీలించారు. కుళాయిల ద్వారా ఎత్తులో ఉన్న, కొండపై ఉన్న ఇళ్లకు నీరు అందడం లేదని, మరోవారం రోజుల్లో కొండపై ఉన్న ఇళ్లకు తాగునీరు అందిస్తామని జేఈ కల్యాణ్ తెలిపారు. ఈఓపీఆర్డీ కృష్ణారావు, బి.నారాయణమూర్తి, సూపర్‌వైజర్ గోవింద్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ మృతికి సంతాపం

సారవకోట: మండలంలోని బద్రి గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యుడు మెండ బాలచంద్రరావు నాయుడు అంత్యక్రియలు బుధవారం స్వగ్రామం బద్రిలో కుటుంబ సభ్యులు నిర్వహించారు. నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, మాజీ మంత్రి గుండ అప్పల సూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు, పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య, సారవకోట మాజీ జెడ్పీటీసీ ధర్మాన పద్మప్రియ, జెమ్స్ ఆస్పత్రి యాజమాన్యం, పలువురు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు నివాళులర్పించారు.

29న జాతీయ లోక్ అదాలత్



మాట్లాడుతున్న సివిల్ జడ్జి హరిప్రియ

నరసన్నపేట: ఈ నెల 29న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని, దీంట్లో వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలని స్థానిక కోర్టు సివిల్ జడ్జి సి.హరిప్రియ అన్నారు. లోక్ అదాలత్‌పై పోలీసు అధికారులతో ఆమె బుధవారం సమీక్ష చేపట్టారు. కోర్టు పరిధిలో ఉన్న పోలీస్ స్టేషన్‌లలో అధికంగా కేసులు పరిష్కారమయ్యేలా కక్షిదారులకు అవగాహన కల్పించాలన్నారు. సీఐ బి.ప్రసాదరావు, ఎస్ఐ అశోక్‌బాబు పాల్గొన్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యం

- ప్రతీ గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలి
- డీపీఓ వెంకటేశ్వరరావు



కొత్తూరు: పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న డీపీఓ వెంకటేశ్వరరావు

కొత్తూరు: ప్రతి గ్రామంలోనూ పారిశుద్ధ్య పనులు వారంరోజులపాటు చేపట్టాలని డీపీఓ టి.వెంకటేశ్వరరావు పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. కొత్తూరు గ్రామ పంచాయతీ పరిధిలో బుధవారం చేపట్టిన పారిశుద్ధ్య పనులను డీపీఓ పరిశీలించారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ ఈ నెల 19 నుంచి 25 తేదీ వరకు వారం రోజులపాటు అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేయాలంటూ ప్రభుత్వం ఆదేశించిందన్నారు. వర్షాలు సమీపిస్తున్నందున అంటు వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఎంపీడీఓ త్రివిక్రమరావు, ఈఓపీఆర్డీ కృష్ణారావు, కొత్తూరు పంచాయతీ కార్యదర్శి జానికి స్వరూపణి, గ్రామ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

హిరమండలంలో..

హిరమండలం: గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు సూచించారు. హిరమండలంలోని చెత్త నుంచి సంపద కేంద్రాన్ని బుధవారం పరిశీలించారు. డ్రైనేజీల్లో పూడికతీతలు, రహదారికి ఇరువైపులా పిచ్చిమొక్కల తొలగింపు, తాగునీటి వసతుల్లో క్లోరినేషన్ చేపట్టాలని ఈఓ వై.ఎస్.ఆర్.మూర్తికి ఆదేశించారు. పంచాయతీ సహాయకులు నర్సింగరావు, నాయకులు ఏపీ సురేష్, పి.శ్రీధర్, బాలకృష్ణ, ఈశ్వరరావు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

టి.ఆర్.రాజుపేటలో..

బూర్జ: మండలంలోని తోటవాడ పంచాయతీలో గల టి.ఆర్.రాజుపేటలో సర్పంచ్ సూర ఆనందరావు ఆధ్వర్యంలో బుధవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. మురుగునీటి కాలువల్లో పూడికలు తీయించారు. వీధులను శుభ్రం చేసి చెత్తను సుదూర ప్రాంతాలకు తరలించారు. చేతి పంపుల చుట్టూ, వీధుల్లో బ్లీచింగ్ చల్లి క్లోరినేషన్ చేయించారు. వర్షాలు పడుతున్నందున రోగాలు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టినట్లు సర్పంచ్ తెలిపారు.

నరసన్నపేటలో..

నరసన్నపేట: జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు ఈ నెల 25 వరకు గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఎంపీడీఓ రామకృష్ణ అన్నారు. నరసన్నపేట పంచాయతీలోని పలు వీధుల్లో పేరుకుపోయిన చెత్తను, కొబ్బరి బొండాల వ్యర్థాలను తొలగించారు. పంచాయతీ కార్యదర్శులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. నరసన్నపేట ఈఓ చిన్నారావు ఉన్నారు.



హిరమండలం: చెత్తనుంచి సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీఓ వెంకటేశ్వరరావు



బూర్జ: మురుగును తొలగిస్తున్న దృశ్యం



నరసన్నపేట: కొబ్బరి బొండాల వ్యర్థాలను ఎత్తిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ

ప్రభుత్వ స్థలాలను రక్షించాలి

- శ్రీకాకుళం ఆర్డీఓ రంగయ్య



నరసన్న చెరువులో ఆక్రమణలను పరిశీలిస్తున్న ఆర్డీఓ రంగయ్య

నరసన్నపేట: చెరువులు, ప్రభుత్వ స్థలాలను రెవెన్యూ అధికారులు, వీఆర్వోలు రక్షించాలని శ్రీకాకుళం ఆర్డీఓ సీహెచ్ రంగయ్య అన్నారు. నరసన్నపేటలోని పలు చెరువులు ఆక్రమణలకు గురవుతున్నాయని, వీటిపై అధికారుల నిఘా ఉంచాలని, ఎంతటివారైనా ఆక్రమణలకు పాల్పడితే కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఆక్రమణలపై సిబ్బంది ఉదాసీనంగా ఉంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బుధవారం నరసన్నపేట తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన ఆయన తహసీల్దార్ కనకారావుతోపాటు రెవెన్యూ సిబ్బందితో మాట్లాడారు. ఆక్రమణల పట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు. నరసన్న, శర్మాల చెరువులు ఆక్రమణలకు గురవుతున్నాయని ఆర్డీఓ దృష్టికి స్థానిక విలేకరులు తీసుకువెళ్లారు. నరసన్న చెరువును రెడ్డికి పేటకు వెళ్లే తోవలో ఏకంగా పొలాలు కట్టడం జరిగిందన్నారు. శర్మాల చెరువు గర్భంలో కూడా పొలాలు ఏర్పాటు చేశారని వీటిపై పరిశీలన చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ఆర్డీఓ మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలను కాపాడాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులు, సిబ్బందిపై ఉందని, దీనిపై అప్రమత్తంగా ఉండాలన్నారు.

రహదారిలో దిగబడిన లారీ



రహదారిలో కూరుకుపోయిన లారీ

సరుబుజ్జిలి: అలికాం-బత్తిలి రహదారిలో మండల కేంద్రానికి సమీపంలో బుధవారం లారీ దిగబడింది. ఈ రోడ్డులో తరచూ లారీలు కూరుకుపోతున్నాయి. ఇప్పటికే దాదాపు ఐదుసార్లు లారీలు, ఇతర వాహనాలు రహదారిలో కూరుకుపోవడంతో ట్రాఫిక్ సమస్యలు లేకుండా పలుమార్లు పోలీస్ యంత్రాంగం లారీలను బయటకు తీశారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

కాలువలను బాగుచేయండి



పూడికతో నిండిన వంశధార కుడి ప్రధాన కాలువ

ఎల్.ఎన్.పేట: మండలంలోని వేలాది ఎకరాలకు సాగునీరు అందించే వంశధార కుడి ప్రధాన కాలువతోపాటు పిల్ల కాలువల్లోనూ పూడికలు పేరుకుపోయాయి. శివారు పంట భూములకు సాగునీరు అందటం కష్టంగా మారుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎల్.ఎన్.పేట మండలం పరిధిలోని 16 కిలో మీటర్ల పొడవున ప్రధాన కాలువతో పాటు 4-ఎల్ నుంచి 11-ఎల్ వరకు పిల్ల కాలువలున్నాయి. వీటి పరిధిలో సుమారు 8 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. ప్రధాన కాలువలో పూడికలు, పిచ్చి మొక్కలు పెరిగిపోవటంతో సాగునీటి ప్రవాహానికి అడ్డంకిగా మారిందని రైతులు చెబుతున్నారు. ఖరీఫ్ వరిసాగు కోసం కాలువల్లో నీరు విడిచిపెట్టక ముందే ప్రధాన కాలువతో పాటు పిల్ల కాలువల్లో పిచ్చిమొక్కలు, పూడికలు తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సేవా కార్యక్రమాలు భేష్



ఎమ్మెల్యే రమణమూర్తిని సత్కరిస్తున్న సత్యసాయి భక్తులు

నరసన్నపేట: సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు బాగున్నాయని, ఇలాగే కొనసాగించాలని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సత్యసాయి భక్తులకు సూచించారు. రెండోసారి ఎమ్మెల్యేగా రమణమూర్తి ఎన్నిక కావడంతో స్థానిక మారుతీనగర్ సాయి మందిరానికి చెందిన భక్తులు జామి వెంకటరావు, ఊణ్ణ నారాయణమూర్తి బుధవారం ఎమ్మెల్యేను కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా సమితి సేవలను ఎమ్మెల్యే అభినందించారు. ఈ సందర్భంగా ఇటీవల కాలంలో సత్యసాయి భక్తులు చేస్తున్న సేవా కార్యక్రమాలను ఎమ్మెల్యేకు మందిరం సభ్యులు వివరించారు. వేసవి దృష్ట్యా కాలేజీ కూడలి వద్ద రెండు నెలలుగా మజ్జిగ పంపిణీ చేస్తున్నామన్నారు. చిత్తిరి వీధి మందిరంలో మహిళలకు చేనేత మగ్గంపై ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఊణ్ణ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రూ.65 వేల ఆర్థికసాయం



ఆర్థిసాయం అందజేస్తున్న సంఘం సభ్యులు

పాతపట్నం: మండలంలోని బోరుభద్ర గ్రామానికి చెందిన బంధన పవన్‌కుమార్ గత కొంత కాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. బుధవారం చేత్తాద శ్రీవైష్ణవ సంఘం ఆధ్వర్యంలో పవన్‌కుమార్ ఇంటికి వెళ్లి రూ.55 వేల ఆర్థిక సహాయం అందించారు. అలాగే మరికొంత మంది రూ.10 వేలు అందజేశారు. సంఘం అధ్యక్షుడు బంధన వామన మురళి, కేలం కామేశ్వరరావు, నారాయణస్వామి, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

స్టూడెంట్ కిట్లు పంపిణీ



జలుమూరు: కిట్లు అందజేస్తున్న ఎంఈఓలు



ఎల్.ఎన్.పేట: పుస్తకాలు పంపిణీ చేస్తున్న తేజేశ్వరరావు



బూర్జ: పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు, నాయకులు

జలుమూరు: కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ స్కూళ్లలో మౌలిక వసతులు ఉచితంగా అందించడం జరుగుతుందని ఎంఈఓలు బి.మాధవరావు, ప్రసాదరావు అన్నారు. జలుమూరు బాలికల ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం అందించిన స్టూడెంట్ కిట్లును బుధవారం అందించారు. హెచ్‌ఎం ఇప్పిలి వేణుగోపాలరావు, మునుకోటి దాము తదితరులు పాల్గొన్నారు.

ఎల్.ఎన్.పేట: ప్రతి విద్యార్థినీ ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాలని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శివ్వాల తేజేశ్వరరావు అన్నారు. మండలంలోని రావిచంద్రి జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం పాఠ్యపుస్తకాల కిట్లును పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ పల్లి రామినాయుడు, పాఠశాల కమిటీ చైర్మన్ బి.లక్ష్మణరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు కె.లక్ష్మునాయుడు, హెచ్‌ఎం బి.శ్రీనివాసరావు, సీఆర్పీ తవిటినాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బూర్జ: మండలంలోని టి.ఆర్.రాజుపేటలో గల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు టీడీపీ నాయకులు పీరుకట్ల విశ్వప్రభాకర్, పీరుకట్ల సీతబాబు పుస్తకాలు పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొత్తూరు: మండలంలోని గూనభద్ర ఆర్‌ఆర్ కాలనీలో గల ప్రాథమిక పాఠశాలలో వైఎస్సార్‌సీపీ నాయకుడు కె.వైకుంఠరావు స్టూడెంట్ కిట్లును పంపిణీ చేశారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పొందూరు: తోలాపి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్టూడెంట్ కిట్లను హెచ్‌ఎం వి.సత్యరాజు పంపిణీ చేశారు. మొదటి విడతలో పాఠ్య, నోట్ పుస్తకాలు, బ్యాగ్‌లను అందిస్తున్నామన్నారు. రెండో విడతలో షూలు, యూనిఫాం అందిస్తామన్నారు. నాయకులు పి.కల్యాణి, పొన్నాడ రామారావు, పి.అప్పలనాయుడు, పి.శ్రీనివాసరావు, పి.గంగాధరరావు, డి.సత్యం తదితరులు పాల్గొన్నారు.

సరుబుజ్జిలి: మండల కేంద్రంలోని నందికొండ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు టీడీపీ నాయకులు విద్యాకానుక కిట్లు పంపిణీ చేశారు. నాయకులు ధవళ సింహాచలం, యండ రామారావు, కొమనాపల్లి రవికుమార్, ఇల్లాకుల ప్రభాకరరావు పాల్గొన్నారు.



కొత్తూరు: కిట్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు వైకుంఠరావు



పొందూరు: కిట్లు అందజేస్తున్న హెచ్‌ఎం, నాయకులు



సరుబుజ్జిలి: కిట్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

సికిల్ సెల్ ఎనీమియాపై అవగాహన



ఆమదాలవలస: అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మాధురి



మెళియాపుట్టి: ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, వెలుగు సిబ్బంది

ఆమదాలవలస: మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు సికిల్ సెల్ ఎనీమియాపై డాక్టర్ సి.హెచ్.మాధురి అవగాహన కల్పించారు. మండలంలోని దూసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో వెలుగు ఏపీఎం పైడి కూర్మారావు ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కల్పించారు. రక్త కణాల సంఖ్య తగ్గడం, కళ్లు పసుపు రంగులోకి మారడం, తీవ్రమైన కీళ్ల నొప్పులు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అలసట, తరచుగా వచ్చే అంటూ వ్యాధులు, గర్భధారణ సమయంలో సమస్యలు ఉంటాయన్నారు. ఇటువంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. క్లస్టర్ కో ఆర్డినేటర్ చందరరావు, వీఓఏలు సునీత, సువర్ణ, పావని, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మెళియాపుట్టి: బలమైన ఆహారం తీసుకోకపోవడం వల్లే రక్తహీనత వ్యాధికి గురవుతామని స్థానిక వెలుగు ఏపీఎం లలిత అన్నారు. బుధవారం ప్రపంచ సికిల్ సెల్ ఎనీమియా (రక్తహీనత వ్యాధి) దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని కేజీబీవీలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. రక్తహీనత బారిన పడకుండా పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. వ్యాధి లక్షణాలను వివరించారు. ఉపాధ్యాయులు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

వరి విత్తనాల సరఫరా



పొందూరు: విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు, నాయకులు



ఎల్.ఎన్.పేట: విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంపీటీసీ, తదితరులు



ఆమదాలవలస: విత్తనాలు అందజేస్తున్న టీడీపీ నాయకులు

పొందూరు: మండలంలోని ప్రతి రైతుకు ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరి విత్తనాలను అందించడం జరుగుతుందని వ్యవసాయశాఖ ఏడీ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మార్కెట్ కమిటీలో వరి విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. మండలంలోని మొదటి విడతలో 848 క్వింటాళ్ల వరి విత్తనాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఏఓ బెండి బాబ్జి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎల్.ఎన్.పేట: ఖరీఫ్ సీజన్‌లో విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చూడాలని బొర్రంపేట ఎంపీటీసీ కింతలి చిరంజీవి అన్నారు. బొర్రంపేటలోని రైతు భరోసా కేంద్రం వద్ద బుధవారం విత్తనాలు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. విత్తనాలు కావలసిన రైతులు పేర్లు, ఇతర వివరాలు నమోదు చేసుకుని నగదు చెల్లించాలన్నారు. ఎరువులు, విత్తనాలు కోసం రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ సిబ్బందికి సూచించారు. ముంగెన్నపాడు మాజీ సర్పంచ్ యారబాటి రాంబాబు, కాగితాపల్లి భాస్కరరావు, బొడ్డేపల్లి రాము, కంచరాపు లోకేష్, వీరఘట్టపు అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: మండలంలోని కొర్లకోట గ్రామంలో బుధవారం విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

నేటినుంచి ఆలయ వార్షికోత్సవం



ముస్తాబైన సీతారామ ఆలయం

కొత్తూరు: ఈ నెల 20 నుంచి 22వ తేదీ వరకు మండల కేంద్రంలోని సీతారామ ఆలయ 7వ వార్షికోత్సవం నిర్వహించనున్నారు. మూడు రోజులు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. చివర రోజు 22 తేదీన స్వామివారి కల్యాణం, అన్నప్రసాద కార్యక్రమం నిర్వహిస్తారు. రాత్రి స్థానిక హరిదాసు కొనేరులో తెప్పోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. వార్షికోత్సవానికి ఆలయాన్ని కమిటీ సభ్యులు ముస్తాబు చేశారు.

యంత్రంతో విత్తనాల చల్లడంపై అవగాహన



యంత్రంపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ సిబ్బంది

సారవకోట: మండలంలోని వడ్డినవలస గ్రామానికి చెందిన రైతు ఇప్పిలి రామ్మోహనరావుకి చెందిన పొలంలో బుధవారం విత్తనం, ఎరువు ఒకేసారి వేసుకునే యంత్రంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ వెంకటరావు మాట్లాడుతూ ఒకేసారి విత్తనం, నేలకు కావాల్సిన ఎరువును ఈ యంత్రం ద్వారా వేసుకోవచ్చన్నారు. రైతుకు ఆర్థికంగా ఎంతో మేలు కలుగుతుందన్నారు. ప్రస్తుతం రామ్మోహనరావుకు చెందిన ఆరు ఎకరాలలో యంత్రం సాయంతో సాగు చేస్తున్నట్లు తెలిపారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ హెల్పర్ కుటుంబాన్ని ఆదుకోవాలి

హిరమండలం: మేజర్ పంచాయతీ హిరమండలం కోరాడ-1 అంగన్‌వాడీ కేంద్రంలో హెల్పర్‌గా విధులు నిర్వహించిన డి.అప్పలనర్సమ్మ ఇటీవల మృతి చెందింది. ఆ కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు కె.వి.హేమలత, వి.మధుబాల, పి.అనుసాయ కోరారు. బుధవారం ఆ కుటంబాన్ని పరామర్శించారు. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. సీఐటీయూ నాయకులు సిర్ల ప్రసాద్, జె.కాంతమ్మ, రజినీ ఉన్నారు.

ఉద్యోగోన్నతిపై బదిలీ

బూర్జ: మండలంలోని కొల్లివలస డాక్టర్ బీ.ఆర్. అంబేడ్కర్ గురుకులం ప్రధానాచార్యులు నూక రామకృష్ణ ఉద్యోగోన్నతిపై బదిలీ అయ్యారు. గ్రేడ్ ఒన్ ప్రిన్సిపాల్‌గా అనకాపల్లి జిల్లా సబ్బవరంలో డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ గురుకులం విద్యాలయంలో బాధ్యతలు స్వీకరించినట్లు ఆయన బుధవారం తెలిపారు. విధి నిర్వహణలో సహకరించిన సిబ్బందికి, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేశారు.